


అందమైన పూలచెట్లు, బాగా ఎదిగిన కొబ్బరి చెట్లు, అక్కడక్కడ ఎర్రని పసుపు పచ్చని రోజాలూ పూచి గేటువద్ద జూకామల్లే, బటానీ తీగెలూ పరస్పరం దంపతుల్లా ఓ పందిరిపై కాపురం చేస్తూ చూపరులను ఆకర్షించే ఇల్లే బెంజిమన్‌ది. ''బెంజిమన్‌గారి ఇల్లేది'' అని ఎవరడిగినా సరే ''అదుగో ఆ బటానీ తీగెల ఇల్లు'' అని ఇట్టే చెప్పేస్తారు. అసలు అడగకుండానే పోల్చుకోవచ్చు కూడా. ఇంత అందంగా ఆకర్షణీయంగా ఉన్న ఇంట్లోకి కూడా రాయప్పకు ప్రవేశించడం దుర్లభమై పోయింది,

రాయప్ప, గేటుకు తగిలించిఉన్న "కుక్కలున్నాయి జాగ్రత్త" అన్న బోర్డు చూచి భయంగానే లోనికి ప్రవేశించ బోయాడు కాని భయకరంగా అరుస్తూ "భౌ—భౌ" మని కుక్క మీదికి దూకేసరికి మటుకు బోర్లా పడ్డాడు ఒక్కసారిగా—రాయప్ప కింద పడ్డా కుక్క మొరగడం మాత్రం మాన లేదు. అయితే ఆ అరుపులు అర్ధవంతంగా మానవభాషకు మల్లే విన్పించేసరికి రాయప్ప వింతపడి చూచాడు. "ఎవర్ నువ్—ఎందుకొచ్చావ్—కాల్చేస్తాన్—ఫ్రండ్ ఆర్ ఫో" ఈ పద్ధతిలో బుల్లెట్లలాగా ఒక్కొక్క మాటా దూసుకొని వస్తుంటే జేబులోంచి కళ్ళజోడు తీసి తగిలించుకొని అప్పుడు కాని గుర్తు పట్ట లేక పోయాడు స్పష్టంగా తన మీదికి దూకింది కుక్క కాదు మనిషేనని. "జంతు కోటిలో మానవ లక్షణాలు" అన్న సీరియల్ ఒకటి చాలాకాలం క్రితం రాయప్ప చదివింది జ్ఞాపకానికి వచ్చి, అనుకున్నాడు "నేనెందుకు 'మానవకోటిలో జంతు లక్షణాలు' అన్నమరో పుస్తకం వ్రాయ కూడదూ" అని—

దుమ్ము దులుపుకొని లేచి రాయప్ప పరిశీలించి చూచేసరికి అచ్చం బుల్‌డాగ్‌లా వున్న వ్యక్తి ఎదురుగా కన్పించాడు. రూపంలోనే కాదు కంఠస్వరంలోకూడా ఎలా అంత అద్భుతమైన భైరవ సామ్యం వచ్చిందో అతనికి, రాయప్పకైతే అర్థం కాలేదు.

"ఎవరునువ్—ఏంపని—గుర్ గుర్ గుర్ మన్నట్లు ధ్వని.

"అయ్యా నాపేరు రాయప్ప, నేను జీవకారుణ్య సంఘంలో సభ్యుణ్ణి"—

"ఛత్—జీవంలేద్, — కారుణ్యం లేద్—పో ముందు—మేమేం చందా లివ్వం"

రాయప్ప నిగ్రహించుకొని అన్నాడు "అయ్యా నేను పైసలుకోసం రాలేదు..."

"అయితే ఇంటి కిరాయ్‌కోసం వచ్చావా? టు-లెట్ బోర్డుపెట్టండే—పై భాగంలో మనుష లున్నారు—నో వేకెన్సీ—ఫో—ఫో—ఫో—" అచ్చం కుక్కలాగే తరిమేస్తున్నాడు రాయప్పను ఆయన—అయితే రాయప్ప బాగా ఢక్కా ముక్కీలు తిన్నఘటం. ఇలాంటి అవమానాలూ పరాజయాలూ చూచి చలించే రకం కాదు తను వచ్చిన పనేమిటో చూసుకొని మరీ వెళ్లేనేర్పు, ఓర్పుతో అలవాటు చేసుకున్నాడు—

"క్షమించండి—నేను శ్రీ బెంజిమన్ కోసం వచ్చాను — వారితో కొంచెం మాట్లాడాలి—"

"అరేమాన్—నేనేనయ్యా బెంజిమాన్‌ను—"

"ఓహో — ఈయనే నన్నమాట ఇంటిఓనర్—" అనుకొని రాయప్ప

నమస్కరించి "నన్ను మీ ఫ్రెండ్ వెంకటప్పయ్య పంపితే వచ్చాను" అన్నాడు.

వెంకటప్పయ్య పేరు వినేసరికి మటుకు బెంజిమన్ పెంపుడు కుక్కలా మారిపోయి "ఓహో — రండి రండి లోపలికి" అని ఆహ్వానించాడు. రాయప్ప ఆయన తోకవెంటే నారాయణా అంటూ వెళ్లాడు బెంజిమన్ విచిత్ర తత్వం గూర్చి ఆలోచిస్తూ. నిజంగా ఎంత విచిత్రమైందీ సృష్టి? ఎన్ని స్వభావాలు—ఎన్ని కంఠ స్వరాలు? దేవుడనే వాడే కనుక ఒక డుంటే ఆయనను మించిన అందమైన శిల్పి — చిత్రకారుడూ మరింక ఎవ రున్నారు? అనుకున్నాడు రాయప్ప—

బెంజిమన్ రాయప్పను కుర్చీలో కూర్చోబెట్టి తానూ ఎదురుగా కూర్చు న్నాడు. రాయప్ప అన్నాడు "మీరు ఓ కుక్కను పెంచుతున్నారని విన్నాను "

"ఆఁ—ఆఁ—మా సీజర్—ఇప్పుడే మా ఆవిడతో ఈవెనింగ్ వాక్‌కు వెళ్ళింది —మిస్టర్ రాయప్పా—ఆ కుక్కంటే మాకు ప్రాణం—అది మాకుటుంబంలో ఓ మనిషి కిందేలెక్క—దానికి ఒంట్లో బాగా లేదయ్యా—ఏం చేయాలో తోచక ఒక రిద్దరు డాక్టర్లకు చూపించాను కూడాను. అయినా నయం కాలేదు. ఒక పశువుల డాక్టరైతే అవేవో కుక్క కేకులు నాకిచ్చి ఇవి మీరు తినండి కుక్కకు నయమౌ తుంది, అన్నాడు—ఫూల్! ఆయన ఉద్దేశంలో జబ్బు నాకళ్ళకే గాని కుక్క కేమీలేదని! పోనీ మా సీజర్ తన్ను పశువుల డాక్టర్లకు చూపించి నందుకు బెంగ పెట్టుకుందేమోనని మనుషుల డాక్టర్లను కూడా పిలిచి చూపించాను. వాళ్లు చేసిన వైద్యాలు చూస్తే పశువుల డాక్టర్లే నయ మని పించింది—నాకు బాగా దిగులు పట్టు కుంది మిస్టర్ రాయప్పా. నిన్న మా వెంకటప్పయ్య వస్తే అతనితో దీన్ని గూర్చి చర్చిస్తే "సరే—ఆలోచిస్తా" నన్నాడు. బహుశా ఆయన ఆలోచన లోపలకి మీరువచ్చి వుంటారు మీరేమిటి పశువుల డాక్టరా, మనుషుల డాక్టరా?

"రెండూను—" అన్నాడు రాయప్ప.

"అఫ్‌కోర్స్—ఇప్పు డందరూ రెం డింటినీ ట్రీట్ చేస్తున్నారనుకోండి. ఎక్కువ ఫీజు తీసుకోని చీప్‌గా దొరుకు తాయని పశువుల మందులే మనుషుల కిస్తున్నారు చాలామంది అయితే మీది ఏ తరహా వైద్యం."

"నాది పూర్తిగా ప్రకృతి వైద్యం. మందులకు బదులు మట్టీ మంటా నీరూ గాలీ ఆకాశాలతోనే నయం చేస్తాను—"

దానితో బెంజిమన్ భయపడిపోయాడు "అయితే ఇప్పుడు మా కుక్కకు మట్టి వైద్యమా? మంట వైద్యమా?" అని ప్రశ్నించాడు.


"చూడందే చెప్పడం కష్టం—" అన్నాడు రాయప్పా.

"అయ్యా రాయప్పగారూ—మే మా కుక్కను స్వంత బిడ్డలా పెంచుకుంటు న్నాము. ఎంగిలి చేత్తో మా ఆవిడ కాకిని కూడా తోలేది కాదు సీజర్‌కు మాత్రం రోజూ రసగుల్లాలు కళఖండలూ పెట్టి పెంచుతుంది. అట్లాంటిది మీ వ్యవహారం చూస్తే ఈ కుక్కకు రాతబాగాలేదని వాతలు వేసేటట్లుంది—మా కు మట్టి వైద్యమూ వద్దు మంట వైద్యమూ వద్దు పొండి పొండి" అన్నాడు అయితే రాయప్ప మాత్రం నిరుత్సాహపడలేదు. "బెంజిమన్ గారూ, మరీఅంత ఉద్రేక పడకండి. నేను కేవలం కుక్క డాక్టర్నే కాదు, జీవకారుణ్య సంఘం సభ్యుణ్ణి. భూత దయ మా మూల సూత్రం. చూడండి అనవసరంగా మనం సమాజంలో చాలా జంతువులను హింసిస్తూ వుంటాము. అవి మాత్రం ప్రాణం గల్గినవి కావా? వాటికి కూడా సుఖదుఃఖానుభూతులు లేవా? కాకుంటే వాటికి నోరులేదంతే చెప్ప డానికి. ఉంటేనా, అవీ సభలుపెట్టి ఎన్ని కల్లో పోటీచేసి అధికారం సంపాదించి ప్రజలపై తమకసి తీర్చుకొనేవి—" కాబట్టి పర్యవసానంగా, ఇంతకూ నేను చెప్పవచ్చిం దేమిటంటే అని రాయప్ప ఏదో చెప్పబోతూండగానే శ్రీమతి బెంజి మన్ సీజరుతోసహా బటానీ తీగల కింద నుండి లోనికి ప్రవేశించింది. రాయప్ప చూస్తూనే కుక్క జబ్బేమిటో పోల్చు కున్నాడు—

"ధర్మామీటరూ, స్టెతస్కోపూ తెమ్మం టారా లోపలినుంచి" బెంజిమన్ అన్నాడు.

"అక్కర్లేదు — మీ సరంజామా లోపలే ఉంచండి. చూడండి. మీ కుక్క విషయంలో బొత్తిగా శ్రద్ధతీసు కోవడం లేదు. అందుకే అలా చిక్కి పోతున్నది."

దానితో బెంజమన్‌కు బాగా కోపం వచ్చింది. "చాలు చాల్లేవయ్యా పెద్దమనిషీ. నేనూ నాభార్య కేవలం ఈ కుక్క కోసమే బతుకు తున్నామంటే నువ్వు నమ్ముతావో నమ్మవో, దీని కోసం ఇంట్లో మేమొక డిస్పెన్సరీనే పెట్టాము. దాని ఆరోగ్యం కోసం మా ఆవిడ నిత్యమూ మందులు తీసుకుంటూవుంటుంది. ప్రతిరోజూ దానికి పరిశుద్ధమైన సినీతారలు వాడే సబ్బుతో స్నానం చేయించి పౌడర్‌చల్లి కారులో షికారుకు తీసుకెళ్ళి తిప్పుతూ ఉంటుంది. మా సీజర్ అనాకానీ ఎల్. డి. సీ. యు. డి. సీలు తినే తిండితినదు—మం త్రులూ, రాజకీయ నాయకులూ తినే భోజనం తప్ప మామూలు పెర్‌ప్రైజ్ షాప్‌లోని బియ్యమూ గోధుమలూ వండి పెడితే తినడం సంగతలావుంచి కనీసం వాసనకూడా చూడదు. దానికి బాగా వినో దమూ విశ్రాంతి కలిగించాలనే ఉద్దేశం తోనే కేవలం తెలుగు సినిమాలు మాత్రమే




చూపిస్తూ ఉంటాను వెంట వెంట. అంత శ్రద్ధగా దాన్ని చూచుకుంటూ దాని కోసం ప్రత్యేకంగా ఓ రేడియో కొని క్రికెట్ రన్నింగ్ కామెంటరీలు వినిపిస్తూ హిస్ మాస్టర్ వాయిస్ రికార్డు సంగీతంలో ముంచి తేలుస్తూ శ్రోతలు కోరిన పాటల నుండి ఫేమిలీ ప్లానింగు ప్రోగ్రాముల వరకూ దాని చెవులో నూరిపోస్తూ విద్యా బుద్ధులు నేర్పిస్తుంటే ఇంకా మీరు శ్రద్ధగా చూడటం లేదంటారేమిటీ తెలివి తక్కువగా'' అన్నాడు గుడ్లు విచిత్రంగా మిటకరించి కార్టూన్ పిక్చర్‌లోని పాత్రలాగా.

''అదే దీని కొంప తీసింది" అన్నాడు రాయప్ప దిగులుగా.

"అంటే "ప్రశ్నార్థకంగా చూచాడు బెంజిమన్.

''బెంజిమన్‌గారూ మీ కెన్నేళ్ళు?''

"సుమారు అరవై .''

''మీ ఆవిడకు ''

''నీకేమన్నా మతిపోయిందిటయ్యా. ఆడవాళ్ళ వయస్సు చెపుతారా ఎక్కడైనా—''

''బెంజిమన్‌గారూ—మీరు ఆడవాళ్ళ కాదుగా—నేను మిమ్మల్ని అడుగుతున్నాను ఆవిడగూర్చి—''

'గుర్ గుర్ గుర్' మని 'ఉంటాయి ఓ యాభయ్యో—యాభై అయిదో' అన్నాడు బెంజిమన్.

"మంచిది: మీ కెందరు పిల్లలు?"

బెంజిమన్ నవ్వి "ఇద్దరే ఇద్దరు. ఓ అమ్మాయి, ఓ అబ్బాయి—మేమేం సమాజానికి అన్యాయం చేశామనుకుంటున్నారా ఎక్కువ మందినికని—ఈ ఫామిలీ ప్లానింగ్ ప్రచారాలు రాక ముందు నుంచి కూడా మా దంతా గాంధీయన్ వే—(Gandhian way)"

"చాలా సంతోషం నేను కోరేదికూడా అదే. కానీ ఇద్దరు పిల్లలు పుట్టాక గాని మీకు గాంధీయన్ వేలూ, ఇందిరా గాంధీయన్ లాలూ వల్లించడం లేదు—మరి ఆత్మవత్ సర్వభూతాని అని చెప్పారు పెద్దలు. మొక్కలకూ ప్రాణముందనీ ఆహార నిద్రాభయ మైధునాదులలోనూ సంకల్ప వికల్పాలలోనూ సర్వవిధ ప్రతీకార చర్యలలోనూ వృక్షాలు కూడా మానవులతో సమానమేనని ప్రపంచానికి చాటాడు మహామహుడు జగదీశచంద్రుడు. అలాంటిది చెట్టూకాదు చేమకాదు సాక్షాత్తు భైరవమూర్తి అవతారం, అందులోనూ మీ రొక ప్రిన్స్‌ను పెంచినట్లు పెంచుతున్నారు కదా అలాంటప్పుడు మీ సీజర్ కొక కల్పర్ణియాను చూడవలసిన బాధ్యత మీపై లేదా? అన్నాడు రాయిప్ప.

"వాడ్డూయూమిన్ బై దట్? (అంటే మీ ఉద్దేశమేమిటి?)" అని నొసలు చిట్లించాడు బెంజిమన్ ఎడమచేత్తో బట్ట నెత్తిని రుద్దుకుంటూ.

"మీ కుక్కది మామూలు రోగం కాదు—కావ్యాల్లో ప్రబంధ నాయకులకు వస్తుందే అలాంటి ప్రణయ జ్వరం వచ్చింది. అందులోనూ మీరు తెలుగు సినిమాలు చూపి, మీరు కోరిన పాటలు" విన్పిస్తున్నారాయె—యింక చెప్పేదేముంది—ఇవన్నీ ఉద్దీపన విభావాలు దానికి. నేడు మన సినిమాలు చూచీ, కో-ఎడ్యుకేషన్ కాలేజీల్లో చదివీ, మనుషులే పిచ్చి కుక్కల్లా మారుతున్నారుకదా, అలాంటిది, దానమ్మ కడుపు బంగారంగానూ మీ రెంత ప్రిన్స్‌లాపెంచినా, జన్మతః పశుప్రవృత్తి కలది—దానికి విరహజ్వరం రావడంలో ఆశ్చర్యమేమీ లేదు—కాకుంటే మీరు గుర్తించక పోవడమే ఆశ్చర్యం" అని రాయప్ప సారాంశం తేల్చే సరికి బెంజిమన్ నిర్ఘాంత పోయి ఆలోచనలో పడ్డాడు. "సరే జరిగిన దానికి విచారించి లాభంలేదు. ఇప్పుడైనా మించిపోయింది లేదు.—మీ ఇంటి కొక మంచి ప్రిన్సెస్‌ను కోడలిగా తెచ్చుకోండి. శుభం కల్గుతుంది" అని రాయప్ప కర్తవ్య బోధచేసి బెంజిమన్ భ్రాంతిమండి తేరుకోకముందే జీవకారుణ్య సంఘంలో సభ్యుణ్ణిగా చేర్చి చందా కాగితంపై

ముందు "కమిట్" చేయించి స్వామి కార్యమూ స్వకార్యము కూడా చూచుకొని సంతోషంగా బయట పడ్డాడు.

రాయప్పయితే నవ్వుతూ వెళ్ళిపోయాడు కాని బెంజిమన్‌కు మాత్రం ఓ సమస్య తీవ్రంగా తయారైంది. వెంటనే శ్రీమతిని పిల్చి చెప్పాడు రాయప్ప చెప్పిన రహస్యం. శ్రీమతి పొన్నమ్మా బెంజిమన్ కూడా నిర్ఘాంత పోయింది—"మనమస లావిషయం ఆలో చించనే లేదు" అని మాత్రం అంది మెల్లగా—మొత్తానికి దంపతులు రాత్రింబవళ్ల ఆలోచించి మరో మంచి కుక్కను కొనడమో, కిరాయి తేవడమో చేయాలని నిశ్చయించుకున్నారు. నిశ్చయించు కోవడ మేమిటి అమలు పెట్టడమేమిటి అంతా ఇక గంటలమీద జరిగిపోవాలని పట్టు బట్టాడు బెంజిమన్. కాని శ్రీమతి పొన్నమ్మ మాత్రం అంత త్వరగా వప్పుకోలేదు. కోడలుపిల్ల నలుపైతే కులమంతా నలుపని సామెత చెపుతారు. కాస్త మంచీ చెడూ చూచి మరీ ఆలోచిద్దాం" అన్నది. దానితో బెంజిమన్‌కు కోపం వచ్చి గుర్ గుర్ మన్నాడు "ఆలోచిస్తుందిట. ఇంకా ఆలోచన—ఈ నాటి పిల్లల్లాగే రాబోయే అమ్మాయి ఎం. ఏ చదివీ డాన్సు చేస్తూ క్లబ్బుల కెళ్ళి ఉపన్యాసాలిచ్చి కధలు రాసి పత్రికల్లో పోటీలు గెలుచుకోవాలనే షరతులు పెట్టినట్లు నా సీజరు కూడా ఏ మన్నా షరతులు పెడుతుందనుకున్నావా ఏమిటి?! నీ వాలకం చూస్తుంటే ఎవరన్నా కట్నం డబ్బుతోబాటు కుక్కనుకూడా ఇచ్చిపోతే బాగుండునని కూడా ఆలోచిస్తున్నట్లున్నావే—చాలు చాల్లే పో ఇంక—రంగు రుచీ వాసనా ఆటా పాటా అన్నీ టెస్ట్ చేయడానికి ఇదేం సినిమాలో హీరోయిన్ వేషం వెయ్య బోవడం లేదు. లేదా సర్కస్‌లో ఫీట్సు చేయబోవడం లేదు. నీతో చెప్పడ మెందుకు—ఇంక నేనే తరువాతి కార్యక్రమం చూస్తాను—" అని చెప్పి బెంజిమన్ ఆరోజే ఆ బుల్ డాగ్‌కు మరో చక్కని జోడుని కొని తెచ్చాడు.

సీజర్ తనకు జోడీ దొరికినప్పటినుంచీ తిరిగి బలం పుంజుకోవడం మొదలు పెట్టింది. చాలా హుషారుగా వెన్నెలలో డ్యూయిట్లు పాడుతూ తిరగడం మొదలు పెట్టింది. మళ్ళీ ఓ రోజు రాయిప్ప వచ్చేసరికి బుల్‌డాగ్‌కానీ దాని ఓనర్‌కానీ ఎవ్వరూ మీద పడలేదు; సరికదా కొత్త మనిషి లోపలకిపోతున్నాడన్న విషయం కూడా పట్టించుకోలేదు సీజర్ కొబ్బరిచెట్టు పక్కన పచ్చని గడ్డిలో పడుకోని. రెండు మూడుసార్లు గట్టిగా పిలిస్తేనేకాని బెంజిమన్ బయటకు రాలేదు—

"ఓహో రాయప్పగారా—రండి—రండి—మా కుక్కకు గొలుసుల్లేవు. కొంచెం జాగ్రత్త—

"ఫరవాలేదు లెండి మీ సీజర్ ఇప్పుడు వేరే లోకాలలో విహరిస్తున్నది—ఎలా వున్నారు కులాసాయేనా?"

"ఆఁ—ఆఁ—బాగా నే వున్నాము. కాని మీరు చెప్పినట్లు మా సీజర్ ఇప్పుడు చాలా ఆరోగ్యంగా వుందండీ. అందుకు మీకు ధన్యవాదాలు."

"అబ్బే దీనికి పెద్దగా ధన్యవాదాలు చెప్పనక్కరలేదు. నా బాధ్యత నేను నెర వేర్చాను. మీరు ఇస్తామన్న జీవకారుణ్య సంఘ విరాళం ఇస్తే చాలు కృతజ్ఞుణ్ణి. అందుకే వచ్చాను."

"అలాగే— అలాగే." అని బెంజిమన్ లోపలికి వెళ్లాడు—కాని ఓ పదినిమిషాల వరకూ బయటకు రాలేదు. ఇంతలో లోపలనుంచి పెద్దగా అరుచు కుంటున్నట్లు మాటలు వినవచ్చాయి. ఓ అయిదు నిమిషాల తర్వాత బెంజిమన్ బయటకు వచ్చాడు. ఆయన ముఖం బాగా అలసి పోయినట్లు కన్పడుతున్నది. నుదు రంతా చెమట పట్టివుంది. జేబులోంచి డబ్బులు తీసి రాయప్ప కిచ్చి ఏమీమాట్లాడ కుండా ఓకుర్చీలో కూలబడ్డాడు బెంజిమన్. ఆయన సీరియస్‌నెస్ చూచి మరొకడైతే మాట్లాడకుండా పోయేవాడే కాని రాయప్ప మాత్రం వదలిపెట్టలేదు. బెంజిమన్ గారూ—మీ శ్రీమతిగారు ఈ చందాడబ్బు లివ్వడానికేమైనా అభ్యంతర పెట్టారా?" అని స్పష్టంగానే అడిగాడు.

"నో—నో—అలాంటి దేమీలేదు" అని బెంజిమన్ పైకి అన్నాడు కాని ఏదో దాస్తున్నాడని మాత్రం రాయప్ప గ్రహిం చాడు.


"మీకో మీ శ్రీమతికో ఒంట్లో బాగు న్నట్లు లేదు—" అన్నాడు రాయప్ప మళ్ళీ.

బెంజిమన్ ఓ నిమిషం రాయప్ప వైపుచూచి చెప్పాలా? వద్దా? అని ఆలో చించినట్లు కన్పించి చివరకు అన్నాడు "నిజమే రాయప్పగారూ—మా ఇరు వురికీ ఒంట్లో బాగోలేదు"

"అవును — ఇప్పు డందరికీ ఫ్లూ జ్వరాలు వస్తూవున్నాయి కృష్ణకు కొత్త సీళ్ళు వచ్చాయి కదా"

"అబ్బే అదేమీ లేదండీ, మానసి కంగా మాత్రమే మాకు బాగాలేదు. ఎందుకో ఈ మధ్య అకారణంగా మే మిద్దరమూ తరచు దెబ్బలాడు కొంటు న్నాము. దెబ్బలాట ముగిసిన తరువాత ఒంటరి నేను ఆలోచించి చూస్తే ఏమీ వుండదు వడ్లగింజలో బియ్యపుగింజ. దెబ్బలాట ఎవరు మొదలు పెట్టారన్నది కూడా అర్థం కావడం లేదు — పోనీ, మొదలైతే రెండోవాళ్లు ఎందుకు రెచ్చి పోతున్నా రనేది కూడా బోధపడటం లేదు—"

రాయప్ప ఓ చిరునవ్వు నవ్వాడు. "ఫరవాలేదు— ఈ ఫామిలీ ప్రాబ్లమ్స్




మీకేమిటి ఈ బెజవాడలో అందరిళ్లల్లోనూ వున్నవే—కాకుంటే కొందరు మీలాగా బయటకు చెపుతారు. మిగతా వారు గుంభనగా దాచుకుంటారు. ఇంటిగుట్టు లంకకు చేటని—అంతే! పోనీ మీకేదైనా మందు ఇమ్మంటారా?"

"దయచేసి మీరు మనుషుల మందు మాత్రం ఇవ్వండి-" అన్నాడు బెంజిమన్ నవ్వుతూ—

"అలాగే-మీ భార్యాభర్త లిద్దరూ ఓ నెల రోజులు ఎక్కడికన్నా పిల్‌గ్రిమేజ్ వెళ్ళిరండి — వాతావరణం మనస్సును బాగు పరుస్తుంది—వెంట మీ పిల్లల్ని కాని కుక్కల్ని కాని ఏమీ తీసుకొని పోకండి."

"బాగుంది మీ వైద్యం—నా కసలే ఈ ఇల్లు వదిలిపెడితే ఉండ బుద్ధిపుట్టదు. ఆవిడకూ అంతే! ఇంటిమీద మమకారం ఎంత ఎక్కువైందంటే ఇక్కడి ప్రతి వస్తువూ ఆవిడచేతితో అలా ప్రతిక్షణమూ తా' తేతప్ప సంతృప్తి చెందడం లేదు. పెద్దవాళ్ళమై పోతున్నామని ఇటీవల ఆవిడకు దిగులొకటి కట్టుకున్నట్లుంది. రాత్రిళ్ళు అలా ఒంటరిగా కిటికీలోంచి దూరంగావున్న గాంధీ పర్వతాన్ని చూస్తూ కాలం గడుపుతూ ఉంటుంది. ఏమిటో?

ముసలితనమంటే ఇంతే రాయప్ప గారూ.

రాయప్ప నవ్వి "చూడండి ఇద్దరు పిల్లలున్నారు—చక్కని ఇల్లు, శుభ్రంగా నెల తిరిగేసరికి టంచనుగావచ్చే ఇంటి అద్దె, బ్యాంకు బాలన్సు. మీరే ఇలా దిగులుపడితే ఇంక లోకంలో ఎవడు సుఖంగా వుండగలడు—" అని ఓ

కాగితంమీద ఏదో వ్రాసి ఓ కవరులోపెట్టి అంటించివేసి "బెంజిమన్‌గారూ — ఈ కవరు భద్రంగా దాచండి. నేను వెళ్ళిన తర్వాత దాన్ని చించి చదవండి. ఇందులో ప్రిస్క్రిప్షన్ వ్రాసి ఉంచాను. మరి నేను శలవు తీసుకుంటాను" అని వెళ్ళిన దిక్కునే చూస్తూ కూర్చున్నాడు చాలా సేపు. తర్వాత వెళ్ళి కవరును డ్రాయిర్లో పడేశాడు. ఒకటి రెండు రోజులైన తర్వాత దాని మాట మరిచే పోయాడు!

ఇలా వుండగా ఒకనాడు వెన్నెల బాగా వచ్చింది. శ్రీమతి పొన్నమ్మ రుసరుస లాడుతూ బెంజిమన్‌కు భోజనం పెడ్డించింది. గుర్ గుర్ మన్నాడు ఆమె ప్రవర్తనకు. చూస్తూండగానే మాటా మాటా అనుకున్నారు. బెంజిమన్ తినకుండా చెయ్యి కడుక్కొని లేచి ప్లేటు మొత్తమూ సీజరుకు పడేశాడు. సీజరూ దాని జోడీ వెన్నెలలో ఉల్లాసంగా తోక లాడించు కుంటూ ఖరీదైన ఆ పదార్థా లన్నీ తిన్నాయి. ఇది చూచే సరికి పొన్నమ్మకు మండుకొచ్చింది—భర్త అన్నం తిననందుకు తిట్టింది బెంజిమన్ కూడా రెచ్చిపోయి "నువ్వొండిన వంట కుక్క తప్ప ముట్టదు" అన్నాడు. "అయితే ఇన్నాళ్ళనుంచీ ఇన్నేళ్ళనుంచీ నా చేతి వంట తినే మీరేమవుతారు?" అన్నది పొన్నమ్మ ఉద్రేకంలో నోరు జారి—దానితో బెంజిమన్ స్వాధీనాన్ని కోల్పోయి పొన్నమ్మపై చెయ్యి చేసుకున్నాడు .దూరంనుంచి ఈ దృశ్యం చూచిన సీజర్ పిచ్చిపట్టినట్లు ఎగిరింది— ఆ రోజురాత్రి బెంజిమనూ, పొన్నమ్మలు ఎప్పుడు నిద్రపోయారో వారికి కూడా తెలియదు—

మర్నాడు ఉదయం నిద్రలేచి బెంజిమన్ మెట్లు దిగి వచ్చేసరికి ఓ భయంకర దృశ్యం కన్పడింది. సీజర్ పక్కనేవున్న కుక్క చచ్చి పడివుంది. సీజర్‌కు పిచ్చి పట్టిందని బెంజిమన్ గ్రహించాడు. గబగబా మేడ మెట్లెక్కి గదిలోకిపోయి టేబిల్‌ముందు కూర్చున్నాడు— శ్రీమతి పొన్నమ్మ మాత్రం గది తలుపులు తీసుకొని బయటకు రాలేదు. అసలు సీజర్ ఎందుకని ఆ కుక్కను చంపింది? ఇంత అకస్మాత్తుగా దాని కెందుకు పిచ్చి పట్టింది?? బెంజిమన్‌కు తల తిరిగిపోయినట్లనిపించింది. ఏమీ తోచని అయోమయ స్థితిలో— రాయప్ప గుర్తు కొచ్చాడు. గబగబా డ్రాయరు సొరుగులో నుంచి రాయప్ప వ్రాసిన కవరు చింపి చదివాడు. "మీరు కాని మీ భార్యకాని ఆవేశంలో కుక్కలకు మాత్రం అపకారం చేయకండి. వాటిని ఎక్కడైనా వదిలేసిరండి—ఇలా వ్రాసినందుకు క్షమించండి—మీ రాయప్ప" అని వ్రాసిన వాక్యాలు చదివి నిర్ఘాంత పోయాడు బెంజిమన్.

———